# ఇల్లెందు మండలం మోదుగులగూడెం వద్ద
# రేపే సీఎం కేసీఆర్ సభ

ఇల్లెందు రూరల్, అక్టోంబర్ 30: మండలంలోని బొజ్జాయిగూడెం పంచాయతీ మోదుగులగూడెం వద్ద నవంబర్ 1న సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభ జరగనుంది. ఈ సభకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ వినీత్ ఆదేశించారు. సభాస్థలిని ఆయన సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్, సభ ప్రాంగణం, వాహనా పార్కింగ్, పటిష్ట బందోబస్తు, నిఘా తదితరాంశాలపై డీఎస్పీ రమణామూర్తితో చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్

ఆ రోజు జిల్లా పోలీసు యంత్రాంగం విరామం లేకుండా సభ ప్రాంగణమంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇల్లెందు సీఐ కరుణాకర్, సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేయాలి

టేకులపల్లి, అక్టోబర్ 30: రేపు జరుగబోయే సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభను బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, బోడ బాలూనాయక్ పిలుపునిచ్చారు. వారు సోమవారం స్థానిక కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. సభకు మండలం నుంచి ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించాలన్నారు.

## ఓటు వినియోగంపై కళాజాతా


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

టేకులపల్లి, అక్టోబర్ 30: ఓటు హక్కు వినియోగంపై జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్వో) శ్రీనివాస్ పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం టేకులపల్లి పంచాయతీలోని గ్రామాల్లో కళాజాతా ప్రదర్శనలు ఇచ్చారు. ఓటు ఎందుకు వేయాలో ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లంకపల్లి కిరణ్, కళాకారులు కాంపల్లి బాలకృష్ణ, అలవాల కృపానాథం, షేక్ మౌసా, మిట్టపల్లి నరేందర్, ముక్తవరం ధనలక్ష్మి, గుగులోత్ నీలా, షేక్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు నమోదుకు నేడు చివరి రోజు

టేకులపల్లి, అక్టోబర్ 30: కొత్తగా ఓటు నమోదుకు మంగళవారం చివరి రోజని తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ఇల్లెందు, అక్టోబర్ 30: పట్టణానికి చెందిన వట్టం రాజు-అనూష దంపతుల కుమార్తె చిన్నారి ప్రణీత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ఆమె వైద్య ఖర్చుల కోసం తల్లిదండ్రులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్లెర్ల చంద్రశేఖర్ సోమవారం రూ.10వేలు అందజేశారు. ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, సభ్యులు ఏలుగూరి నగేష్, కలవల ప్రవీణ్ పాల్గొన్నారు.

## భద్రతా సూత్రాలను పాటించాలి


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జనరల్ మేనేజర్లు దామోదర్, ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 30: సింగరేణి ఉద్యోగులు తప్పనిసరిగా భద్రతా సూత్రాలను పాటించాలని తనిఖీ బృందం కన్వీనర్, సెంట్రల్ వర్క్‌షాప్ జనరల్ మేనేజర్ ఎన్.దామోదర్‌రావు అన్నారు. ఇల్లెందు ఏరియాలోని వర్క్‌షాపులో జీఎం జాన్ ఆనంద్‌తో కలిసి 54వ వార్షిక భద్రత పక్షోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎల్లప్పుడూ భద్రతా సూత్రాలను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తికి సహకరించాలన్నారు. సింగరేణి సంస్థ తన ఉద్యోగుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పి.శ్రీనివాసు, నరసింహరాజు, విజయ్‌శేఖర్ బాబు, పూర్ణచందర్, ఎం.కేశవరావు, నటరాజ ప్రసాద్, కృష్ణారావు, పవన్‌కుమార్, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం


విజిలెన్స్ వారోత్సవాల్లో జీఎం ఆనంద్, ఉద్యోగులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 30: సింగరేణి ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలను జీఎం జాన్ ఆనంద్ సోమవారం ప్రారంభించారు. రక్షణ ప్రతిజ్ఞ చేశారు. అధికారులు మల్లారపు మల్లయ్య, పి.శ్రీనివాసు, గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్రం భీమ్‌కు నివాళులు

కారేపల్లి, అక్టోబర్ 30: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం కుమ్రం భీమ్ 88వ వర్ధంతిని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమవారం పాటిమీదగుంపు, కారేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేశారు.

## బీఆర్ఎస్ నాయకుడు మృతి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 30: మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు శీలం సురేష్(40) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్-హరిసింగ్ నాయక్ దంపతులు సందర్శించి నివాళులర్పించారు. సురేష్ సోదరుడైన శీలం రమేష్(బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు)ను, కుటుంబీకులను పరామర్శించారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక


పార్టీలో చేరిన వారితో రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 30 : మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట ఏరియాకు చెందిన 40 కుటుంబాలు మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందన్నారు. అత్యధిక మెజార్టీ సాధించేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ నెల రోజులు శక్తి వంచనలేకుండా కృషిచేయాలన్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు ఇంటింటికెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలేరు నుంచి సాగర్ జలాలు విడుదల

కూసుమంచి, అక్టోబర్ 30: జిల్లాలో సాగర్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించేందుకు అధికారులు పాలేరు జలాశయం నుంచి సోమవారం నీటిని విడుదల చేశారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద పంటలకు సాగు నీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు ఇటీవల గోదావరి జలాలను బయ్యన్నవాగు ద్వారా పాలేరుకు మళ్లించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆ జలాలు పాలేరుకు చేరుకోవడంతో సోమవారం వారు వాటిని విడుదల చేశారు. బయ్యన్న వాగు ద్వారా 1,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. పాలేరు నుంచి 1,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులకుగాను ప్రస్తుతం 18 ఉంది.

## ఒకే రోజు 11వేల పత్తి బస్తాల రాక

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 30: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం కొత్త పత్తి ధర క్వింటాకు రూ.7,100 పలికింది. గడిచిన పక్షం రోజుల నుంచి వానాకాలం పంటను రైతులు మార్కెట్‌కు తెస్తున్నారు. సోమవారం ఉదయం వివిధ జిల్లాల నుంచి రైతులు 11,395 బస్తాలను పత్తి యార్డుకు తీసుకొచ్చారు. వ్యాపారులు పోటీపడి ఆన్‌లైన్ బిడ్ చేయడంతో కొత్త పత్తి పంటకు క్వింటాకు రూ.7,100 ధర పలికింది. మధ్య ధర రూ.7 వేలు, కనిష్ట ధర రూ.4,600గా నమోదైంది. పాత పంటకు గరిష్ట ధర రూ.6,800, కనిష్ట ధర రూ.4,600 చొప్పున నిర్ణయించి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. మరికొద్ది రోజుల్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ తరుణంలో సీసీఐ కంటే ప్రైవేట్ మార్కెట్లోనే అధిక ధర పలుకుతుండడంతో ఈ సంవత్సరం కూడా సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. పత్తికి అధిక ధర పలుకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కోట మైసమ్మ జాతర ఆదాయం లెక్కింపు

కారేపల్లి, అక్టోబర్ 30: మండలంలోని ఉసిరికాయలపల్లిలో ఇటీవల వారం రోజులపాటు కోట మైసమ్మ జాతర జరిగింది. హుండీ కానుకలను దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ.26,16,145, టికెట్ల ద్వారా రూ.4,81,280, దుకాణాల ద్వారా రూ.3,08,200, ఎగ్జిబిషన్ ద్వారా రూ.1.50 లక్షలు, చీరల వేలం పాట ద్వారా రూ.17,770, వాహన పూజల ద్వారా రూ.61,000 ఆదాయం వచ్చినట్లు దేవాలయ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు తెలిపారు. గత ఏడాదికంటే ఈసారి రూ.24వేలు తక్కువ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సిబ్బంది శ్రీనావాసాచార్యులు, సమత, వెంకటేశ్వరరావు, గణితి నారాయణ, సాయి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శెట్టుపల్లిలో 'మదర్స్ గార్డెన్'

గుండాల, అక్టోబర్ 3: నీతి అయోగ్‌లో ఆస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా మండలంలోని శెట్టుపల్లి గ్రామంలో సోమవారం 'మదర్స్ గార్డెన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం జే అరుణకుమారి మాట్లాడుతూ కూరకాయలు, పండ్లు ఇచ్చే మొక్కలను గార్డెన్‌లా ప్రతి గర్భిణి పెంచాలని సూచించారు. ఇంటి పరిసరాలలో అన్ని జాతుల మొక్కలు పెంచడం వల్ల మదర్స్‌కి ఇంట్లోని పిల్లలకు పోషకాలను అందించడమే కాకుండా మానసిక ఆనందాన్ని అందిస్తుందన్నారు. అనంతరం ఇంటిటికి తిరుగుతూ మొక్కలు నాటించారు. కార్యక్రమంలో నీతి అయోగ్ గాంధీ ఫెల్లో, ఆస్పిరేషనల్ భారత్ కొలబ్రేటివ్ హరిహరన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిలోక్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ లావణ్య, ఏఎన్ఎం ధనమ్మ, హెల్త్ అసిస్టెంట్ బిక్ష్య, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, సుధారాణి, కల్తి మంగమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొన్ని రైళ్ల రద్దు, మళ్లింపు

సిటీ బ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : విశాఖపట్నం వాల్తేర్ డివిజనల్ రైల్వే పరిధిలో జరిగిన రైలు ప్రమాదంతో ఆయా మార్గంలో రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆయా మార్గాంలో తిరుగాల్సిన 21 వరకు రైళ్ల రాకపోకలను రద్దు చేస్తూ ఎస్‌సీఆర్ అధికారులు సోమవారం నిర్ణయించారు. దాదాపు 30 రైళ్ల వరకు దారి మళ్లించినట్లు తెలిపారు. 13 రైల్వే స్టేషన్ల పరిధిలో ప్రయాణికుల కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.